శిష్యుడు వెంటనే తన తప్పుని గ్రహించి, అప్పటి నించి గురువుని అత్యంత శ్రద్ధగా సేవించి, త్వరలోనే ఆధ్యాత్మిక ప్రగతిని సాధించాడు.

## 100. కృతజ్ఞత

ఓ వృద్ధుడు ఎంతో కష్టపడి చిన్న గోతిని తవ్వి అందులో ఓ మామిడి టెంకని పాతి రోజూ నీళ్ళు పోయసాగాడు. ఓ రోజు అది మొలకెత్తింది. ఈ మొత్తం గమనించిన ఆ వృద్ధుడి పక్కింటివాడు ఆయన్ని అడిగాడు.

"తాతా! ఆ మొక్క పెద్దదై పళ్ళు కాసేసమయానికి నువ్వు బ్రతికే వుంటాననుకుంటున్నావా?"

"లేదు. అంతకాలం నేనుండను." జవాబు చెప్పాడు ఆ వృద్ధుడు.

"మరి నువ్వెందుకు దాని విషయంలో అంత శ్రమపడుతున్నావు?" అడిగాడు ఆ కుర్రవాడు.

అందుకా వృద్ధుడు చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"తాము తినలేమని తెలిసీ బ్రతికుండగా ఎందరో ఇతరుల కోసం పాతి పెంచిన మామిటి చెట్లనించి నేను ఇంతదాకా ఎన్నో మామిడి పళ్ళని తింటూ వస్తున్నాను. నేనిప్పుడు ఓ చెట్టుని పాతి వాళ్ళు చూపించిన దారిలో నడవడం ద్వారా వాళ్ళకి నేను నా కృతజతలని తెలియచేసుకుంటున్నాను."

## 101. పని కౌశల్యం

ఓ తాపీ మేస్త్రీ అతని కొడుకు కలిసి ఓ కోటని నిర్మిస్తున్నారు. పునాదికి చెందిన ఆఖరి బండకి తగినంత కలిపిన సున్నం లేకపోవడంతో తండ్రి కొడుకుని సున్నాన్ని కలిపి తీసుకురమ్మని చెప్పాడు.

కాని కొడుకు పునాది రాళ్ళ పక్కన నేల మీద పడి వున్న సున్నాన్ని ఎత్తి తెచ్చి తండ్రికి ఇచ్చి చెప్పాడు.

"మళ్ళీ కలపడం దేనికి? దీన్ని వాడదాం నాన్నా."